## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశాభివృద్ధిలో ప్రజలందరూ క్రియాశీల భాగస్వాములు కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- క్షేత్రస్థాయిలో ప్రభుత్వ విధానాలను అమలు చేయడంలో సివిల్ సర్వీసెస్ ప్రధాన పాత్ర పోషిస్తాయని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు.
- ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ దేశీయ ఎల్పీజీ సరఫరాకు అంతరాయం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.
- కేరళ త్రిసూర్ లోని ఒక బాణసంచా నిల్వ కేంద్రంలో సంభవించిన పేలుడు ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశాభివృద్ధిలో ప్రజలందరూ క్రియాశీల భాగస్వాములు కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఒడిశా పర్యటనలో భాగంగా రూర్కెలాలో ఈరోజు జరిగిన ఆదిపరబ్2026 కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి ప్లానిటోరియం, విజ్ఞాన కేంద్రం 'నిర్మల్ ముండా పరివేష్ పథ్'లను ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇదే దృక్పథంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంక్షేమం కోసం వివిధ పథకాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. స్వీయ అభివృద్ధితో పాటు ఇతరుల పురోగతికి సహాయం అందించాలని కోరారు. 2047 స్వాతంత్ర్య శతాబ్ది వేడుకల నాటికి దేశం వికసిత్ భారత్‌గా మారే దిశగా వేగంగా పయనిస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

క్షేత్రస్థాయిలో ప్రభుత్వ విధానాలను అమలు చేయడంలో సివిల్ సర్వీసెస్ ప్రధాన పాత్ర పోషిస్తాయని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈరోజు జరిగిన 18వ సివిల్ సర్వీసెస్ దినోత్సవంలో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ రాజధానిలో ప్రణాళికలు రూపొందించవచ్చునని అయితే వాటిని నిజమైన స్ఫూర్తితో అమలు చేసినప్పుడే మారుమూల గ్రామాల్లో ఫలితాలు వస్తాయని చెప్పారు. సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను అఖిల భారత సర్వీసుల పితామహుడిగా అభివర్ణిస్తూ, సేవాభావం, ఐక్యత అనే ఉమ్మడి స్ఫూర్తితో సర్దార్ పటేల్ దేశాన్ని ఏకం చేశారని ఉపరాష్ట్రపతి అన్నారు. వలస భారతదేశం నుండి వికసిత భారత్‌గా దేశం ఎదగడానికి సర్దార్ పటేల్ వేసిన అడుగులే కారణమన్నారు.

(వాయిస్...28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ దేశీయ ఎల్పీజీ సరఫరాకు అంతరాయం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. పశ్చిమ ఆసియాలోని తాజా పరిణామాలపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ మీడియా సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి

సుజాత శర్మ మాట్లాడుతూ, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు మరియు ఎల్పీజీ ధరలు పెరిగినప్పటికీ, దేశీయ ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూసేందుకు ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేశీయ ఎల్పీజీ సరఫరా సాధారణంగానే ఉందని, ఏ ఎల్పీజీ పంపిణీదారుడి వద్ద కూడా సరఫరా నిలిచిపోయినట్లు నివేదికలు లేవని ఆమె వివరిస్తూ...

(వాయిస్...25 సెకన్లు)

ఇక విదేశాంగ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ భారత్ ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవసరమైన అన్నిచర్యలను ప్రభుత్వం తీసుకుంటోందనీ చెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేరళ త్రిస్సూర్ లోని ఒక బాణసంచా నిల్వ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. త్రిస్సూర్ పూరానికి సమీపంలో ఉన్న ఈ బాణసంచా నిల్వ కేంద్రంలో మధ్యాహ్నం 3 గంటల 30 నిముషాల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ పేలుడు ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా మరో ఐదుగురు గాయపడ్డారు. ప్రాథమిక నివేదికల ప్రకారం, ఒక భారీ పేలుడు ఈ ప్రమాదానికి దారితీసింది. అగ్నిమాపక, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పివేయడానికి సహాయక చర్యలు చేపట్టేందుకు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నాయి.పేలుడుకు గల కారణాలను తెలుసుకోవడానికి జిల్లా కలెక్టర్ సికా సురేంద్రన్ ఈ ఘటనపై రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయి విచారణకు ఆదేశించారు.
ఈ ప్రమాదం కారణంగా సంభవించిన ప్రాణనష్టం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒక సోషల్ మీడియా పోస్టులో, ప్రధాని మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు, అలాగే ఈ ఘటనలో గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి 2 లక్షల రూపాయల చొప్పున, గాయపడినవారికి 50 వేల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియాను కూడా ఆయన ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం జర్మనీలోని మ్యూనిచ్ నగరానికి ఈరోజు చేరుకున్నారు. జర్మన్ ప్రభుత్వ అధికారులు, సైనిక సిబ్బంది విమానాశ్రయంలో మంత్రికి సాదర స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ప్రస్తుత రక్షణ సహకార కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు, కొత్త మార్గాలను అన్వేషించడానికి ఈ పర్యటన ఒక అవకాశాన్ని కల్పిస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. రక్షణ పారిశ్రామిక సహకారాన్ని పెంపొందించడం, సైనిక సంబంధాలను బలోపేతం చేయడం, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేథ, డ్రోన్లు వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో అవకాశాలను అన్వేషించడంపై చర్చిస్తారు. ఇరువురు రక్షణ మంత్రుల సమక్షంలో రక్షణ పారిశ్రామిక సహకార ప్రణాళికతో పాటు 'ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ కార్యకలాపాల శిక్షణ'లో సహకారం కోసం కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది.

= = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్లో మొదటి విడత ఎన్నికల ప్రచారానికి ఈ సాయంత్రంతో గడువు ముగిసింది. పశ్చిమ బెంగాల్ మొదటి దశతో పాటు తమిళనాడులో ఏకైక దశకు ఈనెల 23న పోలింగ్ జరగనుంది. ఇక పశ్చిమ బెంగాల్లో రెండో దశ పోలింగ్ ఈనెల 29న జరుగుతుంది. ఈ రెండు రాష్ట్రాలతో పాటు ఇటీవల జరిగిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఓట్ల లెక్కింపు మే 4వ తేదీన జరుగుతుంది. పశ్చిమ బెంగాల్లో గురువారం 16 జిల్లాల్లోని 152 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ సాయంత్రం వరకూ ప్రచారం నిర్వహించాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సిలిగురి, పశ్చిమ వర్ధమాన్, పశ్చిమ మేదినీపూర్, తూర్పు మేదినీపూర్ జిల్లాల్లో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఇక తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మమతా బెనర్జీ- పూర్బా మేదినీపూర్ లోని హల్దియా, ఉత్తర 24 పరగణాల జిల్లాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంటుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 133వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం వికసిత్ భారత్ వైపుగా పయనిస్తోందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నై సాత్తూర్ నియోజకవర్గంలో పర్యటించి ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. అనంతరం మధురైలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులతో ఆయన ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్డీఏ పాలన అధికారంలోకి రావాలని, వారికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తమిళనాడు ఉజ్వల భవిష్యత్ కోసం ఎన్డీఏ కూటమిని గెలిపించాలన్నారు. మధురై, ఆంధ్రప్రదేశ్లోని రాయలసీమ తరహా ప్రాంతం అని ఇక్కడ కూడా అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ లో భాగంగా హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 12 ఓవర్లు పూర్తయ్యేసరికి 1 వికెట్ కోల్పోయి 138 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

రానున్న రెండు రోజుల పాటు చండీగఢ్, ఢిల్లీ, హర్యానా, తూర్పు రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, చత్తీస్గఢ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్ విదర్భ ప్రాంతాలలో వడగాలులు వీస్తాయని భారత వాతావరణ విభాగం IMD తెలిపింది. అదే విధంగా  కోస్తా ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కేరళ, మాహే, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాలలో వేడి, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని ఐఎండి వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =